

# సంతోషిస్తున్నాను!

యెవిశెట్టి
శంకరరావు

**జాకీని** చదివిస్తున్నాం.

జాకీ అంటే మా కుక్క

జాకీని చదివించాలనే ఐడియా నాది కాదు. మా ఆవిడది.

మా ఆవిడకి ఆ ఐడియా ఎలా వచ్చిందంటే?

• • •

చెల్లాయి పెళ్ళి చూపులు.

కొంచెం సేపు మగ పెళ్ళి వాళ్ళ ముందు కూర్చున్న తరవాత చెల్లాయిని అమ్మ లోపలికి తీసుకు వెళ్ళిపోయింది.

కానీ ఫలహారాలు పుచ్చేసుకుని చెల్లాయిని చూసేసినమగపెళ్ళివాళ్ళ మొహాల్లో సంతృప్తి.

ఎర్రగా, హుందాగా దొరబాబు కనిపిస్తున్నాడు పెళ్ళికొడుకు రవీంద్ర. ఎలక్ట్రికల్ ఇంజనీర్.

పెళ్ళి మాటలు జోరుగా, వేడిగా, అశగా, జాలిగా జరిగాయి.

"అబ్బాయిని ఇంజనీరు చదివించటానికి లక్షయ్యింది. ప్రస్తుతం రెండు అయినా ఇవ్వాలి." ఇంత సూటిగా కాకపోయినా ఇదే అర్థం వచ్చేలా చెప్పాడు పెళ్ళికొడుకు తండ్రి.

నాన్నలో భయం, ఆందోళన కలగలపు.

"అంత ఇచ్చుకోలేను. కొంచెం దయ తలచండి, బావగారూ."

దయ దలిచారు బావగారు.


లక్షన్నరకి తెగింది బేరం.

పెళ్ళి కొడుకు మంచివాడే పాపం! ఈ బేరసారాల్లో తల దూర్చలేదు. మళ్ళీ చెల్లాయి ఎక్కడైనా కన్పిస్తుందేమో నని ఆశగా దొంగ చూపులు చూస్తున్నాడు.

ఎలాగైతేనేం చాలా మాటలు అయిన తరవాత, ఆ బేరం దగ్గర ఖాయం చేసుకుని మిగతా లాంఛనాలు గురించి మాట్లాడుకున్నాం.

• • •

మేం కుదుర్చుకున్న బేరం మాకు తాహతుకు మించింది. అయినా ఆడ పిల్లల సుఖ జీవనం కోసం సర్వస్వం




డిగ్రీ-కమ్-ఐ ఏ ఎస్

ఒక ఐ. ఏ. ఎస్. పరీక్ష గైడెన్స్ కేంద్రంచే ఇండియాలో ప్రప్రథమంగా ప్రవేశ పెట్టబడిన కొత్త సమగ్ర విధానం. మద్రాసు యూనివర్శిటీ బి. ఏ. మరియు ఐ. ఏ. ఎస్. పరీక్షలో విజయం లక్ష్యంగా 3 సంవత్సరాల తీవ్రతర పరీక్ష— ద్రుక్పథ గైడెన్సు.

వేళలు: ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు
ఇతర కళాశాలల వలె పెక్కు మామూలు సెలవు దినాలు లేవు.
శారీరక మరియు మానసిక క్రమశిక్షణ.

కోర్సు డైరెక్టరు
**ఎల్. పాండురంగా రెడ్డి**
(హిస్టరీలో స్వర్ణపతక విజేత మరియు భారత సైన్య మాజీ కెప్టెన్

ఆసక్తి ఉంటే సంప్రదించండి / వ్రాయండి.

సోల్జర్ - స్కాలర్స్
స్టడీ సర్కిల్,
9- ఫుట్‌బాల్ స్టేడియం,
ఫతేమైదాన్,
హైదరాబాద్-500 001.

పదిలేని బికారులయి పోయిమిష్టి వాళ్ళయి పోవటానికి సిద్ధపడే తండ్రులున్న దేశం ఇది. ఆశల శిఖరాల్ని అందుకోవాలని అనాదిగా మనిషి పోరాటం.

మా ఇంట్లో ఆ విషయంపై ఆ తరవాత చిన్న ఘర్షణకూడా జరిగింది.

"పెద్దసామ కట్నం కోసం ఉన్న పొలాలు అమ్మేసి అప్పు లేసి లక్షన్నర తెచ్చారు. అబ్బాయికేం మిగులుస్తారు? మిగతా ఇద్దరాడపిల్లలకి ఏమిచ్చి పెళ్ళి చేస్తారండి?" అమ్మ ఆవేదన.

"నా బతుకు నేను బతగ్గలను మ్మా! చెల్లాయిల సంగతే చూడండి." చెప్పా న్నేను.

"మనం ఉంటున్న ఇల్లుంది గా. పిళ్ళందరి బాధ్యత తీరిపోతే ఆ తరవాత మనం చెట్టు కిందున్నా గడిచి పోతుంది! అన్నిటికీ ఆ దేవుడే ఉన్నాడు." వయసు తెచ్చి పెట్టిన వైరాగ్యంతో అన్నారు నాన్న.

• • •

పట్టుచీర, బుగ్గన పెళ్ళి చుక్క. కుందనపు బొమ్మలా నవవధువు అలంకరణతో నా ముందు నిలిచి కాళ్ళకు నమస్కరించింది చెల్లాయి.

'సుఖ సంతోషాలతో కలకాలం జీవించమ్మా!' మనసులోనే ఆశీర్వదించి బుజాలు పట్టి లేవనెత్తాను.

మంగళవాద్యాల మధ్య చిన్న గొడవ మొదలయ్యింది.

నాన్న పెళ్ళి ఖర్చో కట్నం డబ్బు సేకరించేటప్పుడు ఒక విషయం మరిచి పోయారు.

ఆడపడుచు లాంఛనాలు!

దాని కో రేటుంది!

వెయ్యికి వందట!

ఆ లెక్కన పదిహేను వేలు తక్కువొచ్చాయి.

మా మావగారు ఆగ్రహో (గ్రు లయి పోయి ఆవేశ పడిపోయారు. నాన్నగారు ఆయన కాళ్ళా వేళ్ళా పడి సాధ్యమయి నంత త్వరలో ఇచ్చేస్తానని ప్రమాణం చేసి చెప్పారు.

మావగారు నాన్నగారి ప్రమాణాన్ని నమ్మలేదు. నాన్న వ్రాసిచ్చిన ప్రామిసరీ నోటుని తప్ప!

"జంట బలే బాగుంది కదండీ!" వధూవరులు దండలు మార్చుకుంటుంటే రహస్యంగా నా చెవిలో చెప్పింది మా ఆవిడ.

పెళ్ళి పూర్తయిపోయింది.

అత్తారింటికి వెళ్ళుతున్నప్పుడు మా ఆవిడ్ని కౌగిలించుకుని ఏడిచింది చెల్లాయి. వాళ్ళిద్దరికి మధ్య వదినా—ఆడపడుచుల అనుబంధం కంటే స్నేహితురాళ్ళ రాగ బంధమే గట్టిది.

• • •

"వెంటనే బాకీ ఉన్న డబ్బు పంపిం చేయండి." పెళ్ళయిన ఆర్నెల్లలో మా మూడు ఉత్తరాలు రాసింది చెల్లాయి.

తన పెళ్ళికి చేసిన అప్పు ల్లోంచి మే మింకా తేరుకోలేదు.

చెల్లాయిని చూడటానికి వెళ్ళాను. మామగార్ని గడు వడగటం మరో పని!

పుత్తడిబొమ్మలా నిండుగా, హుషా రుగా చలాకీగా ఉండే చెల్లాయి చాలా మారిపోయింది. దాని కళ్ళలో ఉత్సాహం కనిపించలేదు. కళ్ళ కింద నల్లని వల యాలు ఏర్పడి చైతన్య రహితంగా, పేలవంగా ఉన్నాయి. మనిషి సన్నబడింది.

ఆడపిల్లలు ఎంతలో మారిపోతారు. నాకు నేనే సర్ది చెప్పుకున్నా ఎందుకో చెల్లాయిలోని మార్పు ఆరోగ్యవంత మయిందిగా కనిపించలేదు నాకు.

నా మనసు ఏదో కీడు శంకించ నారంభించింది!

నేను తాగేసి ఇచ్చిన ఖాళీ కాఫీకప్పు అందుకుని వెనుతిరిగిన చెల్లాయి స్వేర్ కట్ జాకెట్ మీాదుగా అస్పష్టంగా వాతలు.

ఎందుకో నాలో అశాంతి!

కట్నం కోసం దీన్ని అత్తమామలు వేధిస్తున్నారా? ఎలాంటి వేదన—శారీరక మైందా? మానసికమైందా? అంత క్రూరంగా ప్రవర్తించగలరా మనుషులు?

మనిషి సృష్టించిన డబ్బు అనే అందమైన రంగు కాగితాలు మనుషుల మధ్య బంధాల్ని, అనురాగాల్ని నాశనం చేసే శక్తి కలదా?

రవీంద్ర తల్లి తండ్రి అంత సంస్కా రం లేనివాళ్ళా!

సంస్కారంతో పని ఏమిటి? డబ్బు దాహం పశుత్వాన్ని తెస్తుంది?

అన్ని పశువులా కుడితి తాగుతాయి. క్రూరత్వదాహాన్ని తీర్చుకుంటాయి.


"ఏమిటే! ఇలా అయిపోయావు?" బాధగా అడిగాను చెల్లాయిని. నిర్జీవంగా నవ్వింది చెల్లాయి.

నేను రెట్టించాను. అదేమీ జవాబు చెప్పలేదు.

ఇంటెడు చాకిరీ చెల్లాయి ఒక్కర్తే చేస్తుండడం గమనించా న్నేను. బహుశా ఇది వచ్చిన తరవాత పనిమనిషిని మానిపించేశారేమో.

ఆ రాత్రి మామగారితో మాట్లాడి కొద్ది రోజులు టయిం మిస్తే మిగతా డబ్బు సర్దేస్తానని ప్రాధేయ పడ్డాను.

ఆయనేం మాట్లాడ లేదు చాలా




సేపు. ఆ తరవాత—''రెండు నెలల్లో ఇచ్చేస్తానన్నారు. మానవజన్మ ఎత్తాక నీతి, జాతీ ఉండా''లని కోపంగా అరిచి చెప్పాడు.

ఆ క్షణంలో అతన్నిచూస్తే డబ్బిస్తే పచ్చి, ఎండు తేడా లేకుండా ఏ గడ్డయినా తినేసే వాడిలా, తినేసి దాహానికి మంచి నీళ్ళకి బదులు మనిషి రక్తం తాగేవాడిలా ఉన్నాడు.

నాలో ఒక నిర్ణయం తీసుకుని నేను లేచాను.

ఆ రాత్రి పదివుతుండగా పక్కమీద పడుకున్నా నిద్ర పట్టటం లేదు. వంట గదిలోంచి మాటలు వినిపిస్తున్నాయి.

''చేతులు చచ్చుబడి పోయాయేమిటి అలా నంగిదానిలా నెమ్మదిగా నత్త నడకలు నడుస్తావేం! త్వరగా వడ్డించు'' అది అత్తగారి కంఠం.

''రేపటికి టిఫిన్ ఏం చెయ్య మంటారు?'' నెమ్మదిగా చెల్లాయి కంఠం.

''ఏదో ఒకటి చేసి మా మొహాన తగలెయ్యి!''

చెల్లాయిని మా ఇంట్లో ఎంత అపురూపంగా చూసుకునే వాళ్ళమో గుర్తొచ్చి నాకు కడుపులో దేవినట్లయింది.

• • •

నేను తిరుగు ప్రయాణానికి సిద్ధమవుతుంటే నన్ను వాటేసుకుని బావురుమంది చెల్లాయి.

మనసులో పీకుతున్న నా అనుమానాలు నిజమయినట్టు అనిపించింది.

''చిట్టీ! నిన్నేమన్నా కష్ట పెడుతున్నారటే!'' సానునయంగా అడిగాను.

''సాధ్యమయినంత త్వరగా వాళ్ళ డబ్బిచ్చేయండ్రా! ఈ చిత్రహింస, మానసిక క్షోభ భరిస్తూ నేను బతకలేన్రా. అన్నయ్యా!'' ఏడుస్తూ వెక్కిళ్ళమధ్య చెప్పింది.

''మీ ఆయన నిన్ను ప్రేమగా చూసుకుంటున్నాడా? మంచి వాడేనా?'' కలత చెందిన హృదయంతో ప్రశ్నల వర్షం కురిపించాను.

''ఆయన కొంచెం సంస్కార వంతుడేరా! తన మానాన తానుంటాడే తప్ప వాళ్ళతో చేరి నన్ను హింస పెట్టడు. ఒక యోగిలా నిశ్చలంగా నా మీద జాలి చూపించటం తప్ప ఆయనేమీ ప్రత్యేకంగా చిత్రహింస పెట్టడు.'' అంతకు మించి చెప్పలేక పోయింది చిట్టి.

చాలా ఆలోచించి అడిగా న్నేను: ''చిట్టీ! నాతో వచ్చి కొన్నాళ్ళ పాటు మాయింట్లో ఉంటావా?''

అప్పుడే చిట్టి అత్తగారు అటు వచ్చారు.

చెల్లాయి ఏమీ మాట్లాడలేదు.

కన్నీటి తెర కప్పిన చిట్టి కళ్ళలోని జవాబు నేను అర్థం చేసుకోలేక పోయాను.

నేను వచ్చేశాను.

• • •

మా ఆవిడతో తప్ప అక్కడ జరిగిన సంఘటనలు ఏవీ నేను ఇంట్లో చెప్పి ఎవర్నీ బాధ పెట్టదల్చుకోలేదు. డబ్బిస్తే చిట్టి సమస్యలు తీరుతాయని నా నమ్మకం.

నా జీతం పైన అయిదువేలు ఆఫీసు లోను, ఇల్లు తాకట్టు పెట్టి మరో పదివేలు తెచ్చాను.

ఆ రోజే రెండో చెల్లాయి మూలన కూర్చుంది.

దాని వేడుకంతా ముగిసే సరికి అయిదు వేలు ఖర్చయి పోయాయి. మరునటి రోజు నేను, నాన్నగారు చెరో ప్రక్క అప్పు కోసం వెళ్ళాలని నిశ్చయించుకున్నాం.

ఆరోజు మధ్యాహ్నం వేళ!

టాక్సీ ఇంటి ముందాగింది.

చెల్లాయి మృత దేహాన్ని డిక్కీ లోంచి బయటకు దించారు. నా గుండె ఆగిపోయి నట్లనిపించింది.

ఇల్లంతా హాహా కారాలు. ఏడుపులు.

చెల్లాయిల శోకాలు...

అమ్మ స్పృహ తప్పి పడిపోయింది.

''అన్నయ్యా!అన్నయ్యా!'' అని నా వెంట తిరిగిన చిట్టిచెల్లి, ''సుఖంగా కలకాలం ఉండమ్మా'' అని నేను దీవించిన చిన్న తల్లి—ఏ బాధలూ లేని మరో లోకానికి వెళ్ళిపోయింది.

ఒళ్ళంతా కాలిపోయి అసహ్యంగా. నల్లగా మాడిన మాంసపు ముద్ద. ఒంటి మీద స్పష్టంగా కనిపిస్తున్న వాతలు—ఆడపిల్లగా పుట్టిన నేరానికి తనే వేసుకుందా, లేక ఈ నాగరక సభ్య సమాజంలో మరెవరైనా పెట్టారా అని నేను ఆలోచించటం లేదు.

పోస్ట్ మార్టమ్‌తో చిత్రం చేసి తిరిగి ముట్టిన చైతన్యంలేని ఆ మాంసపు ముద్దని కౌగలించుకుని నింగి నేలా ఏకమయ్యేలా ఏడుస్తున్న నాన్నని చూడటం లేదు.

ఏ పాటి జీవితం! మూణ్ణాళ్ళ జీవితం!

ఆ మూణ్ణాళ్ళ జీవితాన్ని అనుక్షణం అసహ్యంగా మార్చటానికి ఈ వికృత సంఘం ఎందుకు తహతహ లాడుతుంది!

రవీంద్ర వైపు తలెత్తి చూశాను..

మ్లాన వదనంతో గంగిగోవులా నిలబడ్డా డతను.

చెల్లాయి తుది ప్రయాణానికి ఏర్పాట్లు జరుగు తున్నాయి.

నా గుండె ఏడుస్తోంది.

''రవీంద్రా! నా చెల్లాయి తనంతట తాను చచ్చి పోయిందా, మీవాళ్ళు చంపేశారా! అని నే నడగను. కానీ ఇది మేల్ డామినేటింగ్ సొసైటీ! నీ భార్యని పరాయివాడు రేప్ చేస్తే ఒకటి, నీ వాళ్ళు మృత్యు పాదాల ముఖంగా పడి పిస్తే ఒకటి ఎలా అవుతుందయ్యా! నీ భార్యని రక్షించుకోలేని నువ్వేం మగాడివయ్యా!'' దుఃఖంతో పూడుకు పోయిన నా గొంతులోంచి ఈ మాటలు రాలేదు!

కాని అప్పుడు మా ఆవిడ నా ప్రక్క కొచ్చి నిలబడి రవీంద్రతో చాలా ప్రశాంతంగా అంది.

''మిమ్మల్ని చూస్తుంటే చాలా సంతోషంగా ఉంటుంది. జాకీని—అంటే మా కుక్కనికూడా మీలాగే ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ చదివించాలని ఉంది.''

• • •

అలా మా జాకీ చదువు కుంటోంది. ఇప్పుడు ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ ప్రీ ఫైనలియర్ చదువుతోంది.

మా దేశంలో కుక్కలు మొదలగు జంతువులు చదువు కుంటున్నాయి అని తెలియజేయుటకు సంతోషిస్తున్నాను.

*